అవిశ్వాసంపై పట్టు

- మేయర్ మార్పుపై కార్పొటర్ల తీర్మానం
- హాట్‌హాట్‌గా బండ్లగూడ జాగీర్ రాజకీయం


బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం


మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయం హాట్ టాఫిక్‌గా మారింది. సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్‌లతో పాటు విపక్ష కార్పొరేటర్లు దాదాపు 16 మంది కలిసి మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అంతేకాకుండా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను, ఇతర అధికారులను కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాలు అందించిన విషయం తెలిసిందే.

పాలనపై పట్టు లేకపోవడం..

గడిచిన నాలుగేళ్ళలో పాలనపై మేయర్ మహేందర్‌గౌడ్ పట్టు సాధించకపోవడంతో పాలకవర్గ సభ్యుల మధ్య సమన్వయం లేక విబేధాలకు దారితీసింది. నియంతత్వ విధానాలు, ఒంటెత్తు పోకడలతో, తన మాటే వినాలి అనే దోరణి నచ్చకనే అవిశ్వాస తీర్మానం పెట్టినట్టు తెలుస్తుంది.

తర్వాతి మేయర్ ఎవరు..?

బండ్లగూడ జాగీర్ మేయర్‌గా ఉన్న మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మాణం పెట్టడంతో తదుపరి మేయర్ ఎవరన్నది ప్రశార్థకంగా మారుతుంది. ఈ రేస్‌లో కొన్ని పేర్లు వినిపిస్తున్నా ప్రధానంగా కార్పొరేటర్ మద్దెల లతప్రేమ్‌గౌడ్ ముందు వరసలో కనిపిస్తున్నారు. అంతేకాకుండా సభ్యులంతా ఆమెను ఏకగ్రీవంగా తీర్మానం తెలుపుతున్నట్లు సమాచారం.

కార్పొరేటర్లపై సీరియస్‌గా ఉన్న ఎమ్మెల్యే..

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రకటించడంతో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ కార్పొరేటర్‌లపై సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తుంది.
ఆయన మాట వినని వారికి రాజకీయంగా శరమగీతం పాడటానికి కూడా ఎమ్మెల్యే పావులు కదిపే అవకాశం లేకపోలేదు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడితో మధ్యవర్తిత్వన్ని నడిపారు. అందుకు కార్పొరేటర్లు నిరాకరించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అవిశ్వాసం పెట్టిన కార్పొరేటర్లు క్యాంపుకు వెళ్లినట్లు సమాచారం.

రాముల వారి అక్షింతల పంపిణీ


మాపెల్ టౌన్‌షిప్‌లో అక్షింతల పంపిణీలో పాల్గొన్న సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాపేల్ టౌన్‌షిప్‌లో పవిత్ర అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను గణపతి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అర్చకులు, టౌన్‌షిప్ వాసులు చర్ల గోపాల్‌రెడ్డి, భల్లా మల్లేష్, సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు శ్రీ రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి సభ్యులు అక్షింతలకు హారతులు ఇచ్చి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, వినయ తదితరులు పాల్గొన్నారు.

నూతన కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్: ఎస్టీయు రాజేంద్రనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర ఉపాధ్యాయ కేలండర్‌ను శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి, ఎస్టీయు మండల శాఖ అధ్యక్షులు ఎస్. బాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి పి. వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు నరసింహాచారి, ఎం. రమాదేవి, ఎం. మాధవితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేతోనే ఆత్మస్థైర్యం


ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్‌ను అందజేసిన దృశ్యం

శంషాబాద్: ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో అవసరమని తంగిల్ ముడో మార్షల్ ఆర్ట్ కోచ్ భగవాన్‌దాస్ నాయక్ సూచించారు. తంగిల్ ముండో మార్షల్ ఆర్ట్‌లో గత రెండేళ్లుగా శిక్షణ పొంది, ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు శనివారం ఆర్‌బీనగర్ క్రీడా మైదానంలో సర్టిఫికెట్‌లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పుష్పలత, భారతమ్మ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, కోనమొల్ల శ్రీనివాస్, జి.వై ప్రభాకర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, పరంధాములు తదితరులు విద్యార్థులను అభినందించారు.

పాదయాత్రగా వెళ్లొచ్చి...


సన్మానిస్తున్న బీజేవైఎం అధ్యక్షుడు రాకేశ్ గౌడ్ తదితరులు

రాజేంద్రనగర్: బుద్వేల్ నుంచి శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి పాదయాత్ర ద్వారా బయలుదేరి 38 రోజుల అనంతరం అయ్యప్ప స్వామిని పి. గోపాల్ గౌడ్, పి. బాలు గౌడ్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని శనివారం రాజేంద్రనగర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు రాపర్తి రాకేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్‌గౌడ్, రాముసాగర్, శ్రీనివాస్‌గౌడ్, సందీప్‌చారి, అక్షిత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



శంషాబాద్: తప్పిపోయిన రెండేళ్ల బాలుడిని ఆర్‌జీఐఏ పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. పట్టణంలోని ఎయిర్ పోర్టు కాలనీలో సంచరిస్తున్న బాలుడిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులకు వివరాలు వెల్లడించలేని పరిస్థితిలో ఉండడంతో బాలుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. దీంతో పాటు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. విషయం తెలుసుకున్న బాలుడి తండ్రి ప్రవీణ్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు వెల్లడించి కుమారుడిని తీసుకెళ్లాడు. తప్పిపోయిన బాలుడుని కేవలం 3 గంటల వ్యవధిలోనే తండ్రి చెంతకు చేరుకోవడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మణికొండ : రోడ్డు డివైడర్‌పై గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సన్‌సిటీ వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...హైదర్‌షాకోట్, సన్‌సిటీ ఎస్ లిక్కర్‌మార్ట్ వద్ద రోడ్డు డివైడర్‌పై ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు పోలీసుకు తెలిపారు. ఆ సమయంలో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు 108 అంబులెన్స్‌ను పిలిపించి పరీక్షించగా అతను అప్పటికే మృతి చెందినట్టు వారు నిర్ధారించారు. మృతుడి వద్ద ఆ చూకీకి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవటంతో హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు బ్లూ కలర్ టీషర్ట్, తెల్ల లుంగీ ధరించి ఉన్నాడని, అతని తరపు వారు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

జూపార్కును సందర్శించిన విద్యార్థులు



బహదూర్‌పురా: విజ్ఞాన విహారయాత్రలో భాగంగా, సంక్రాంతి పండుగ సెలవు దినాలను పురస్కరించుకొని హిమాయత్‌నగర్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నెహ్రూ జూలాజికల్ పార్కును సందర్శించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం సీపీఎస్ హిమాయత్‌నగర్ కేంద్ర ప్రాథమిక పాఠశాల సామ సునీతారెడ్డి, సంతోషి స్వప్నారెడ్డి, మహేందర్, జమ్లా నాయక్, రాములు విద్యార్థులతో కలిసి సందర్శించారు.

మిక్సికా టెక్నాలజీస్‌తో సీబీఐటీ ఒప్పందం


మిక్సికా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్న సిబీఐటీ అధ్యాపకులు

మణికొండ: ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనలలో సహాకారం, నూతన ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ మార్కెటింగ్, హ్యాకథాన్స్, కార్పొరేట్ ఇన్నోవేషన్, ఇతర శిక్షణ కార్యక్రమాలను అందించేందుకు మిక్సికా టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) ఒప్పందం చేసుకుంది. శనివారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ అకాడెమియా, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించటం, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంలో ఆవిష్కరణ, విజ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం ఈ భాగసామ్యం లక్ష్యం అన్నారు. అతిథి ఉపన్యాసాలు, వర్క్‌షాప్‌లు మిక్సికా సంస్థ ప్రతినిధులు కళాశాలలో నిర్వహిస్తారన్నారు. కళాశాల ప్రాంగణంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశానికి ఈ సహకారం తోడ్పడుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో వ్యవస్థాపక ఆకాంక్షలతో విద్యార్థులు, అధ్యాపకులకు వనరులు, మార్గదర్శకత్వం అందించటం, ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ కె. గంగాధర్ రావు, ప్రొఫెసర్‌లు డాక్టర్ పి. రమేష్‌బాబు, డాక్టర్ సత్యనారాయణ మూర్తి, ఎ. రజినీకాంత్, ఉమాకాంత్‌చౌదరి, పీఆర్‌ఓ డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, మిక్సికా టెక్నాలజీస్ సీఈఓలు వి. సురేష్‌రెడ్డి, శరణ్, ప్రెసిడెంట్ గిరీష్‌శెట్టి, సీటీఓ రాజిరెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి


ముగ్గులను పరిశీలిస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, తదితరులు

మణికొండ: మన తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా పండగలను జరుపుకుంటామని వాటిని కాపాడుకుని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు నెమలినగర్‌లో కౌన్సిలర్ కె. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగను రంగవల్లులు, పాడి, పంట పండగగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. మహిళలకు ఎంతో ఇష్టమైన పండగల్లో సంక్రాంతి ఒకటన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యాక్రమంలో కౌన్సిలర్‌లు బి. మీనముత్యాలు, ఎస్. శ్వేత కిరణ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు రాజశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూకు నూతన అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

ఏబీవీపీ అధ్యక్షుడిగా బాలకృష్ణ, కార్యదర్శిగా సాక్షి


బాలకృష్ణ, అధ్యక్షుడు


సాక్షి, కార్యదర్శి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్ష, కార్యదర్శిని నియమించారు. ఏబీవీపీ నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బాలకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కరుణాకర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రావుల కృష్ణయ్య సమక్షంలో వీరిద్దరిని ఎంపిక చేశారు. ఏబీవీపీ నూతన అధ్యక్షుడు బాలకృష్ణ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పరిశోధక విద్యార్థిగా ఉన్నారు. రెండు పోస్టుల్లోనూ పరిశోధక విద్యార్థులకు అవకాశం కల్పించడం విశేషం. వీరిద్దరిని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, సాక్షి మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. క్యాంపస్‌లోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అవకాశం కల్పించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు భరోసా


మంజూరు పత్రాలను బాధితులకు అందజేస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: సీఎం సహాయనిధి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసాను ఇస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మియాపూర్‌కు చెందిన రాజేష్‌కుమార్‌కు రూ.లక్ష , అంజయ్యనగర్‌కు చెందిన హుస్సేనమ్మకు రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ మంజూరు పత్రాలను శనివారం ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి నిరంతరం ప్రజలకు సేవలను అందిస్తూ.. ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా నిలుస్తోందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీఎంఆర్‌ఎఫ్ అందిస్తామన్నారు. మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మహ్మద్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలతో కొత్త మార్గంలో పయనించాలి

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

గచ్చిబౌలి: పనికిరానిచెత్త ఆలోచనలకు స్వస్తిపలికి, కొత్త మార్గంలో పయనించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ప్రజలందరికీ సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మూడ్రోజులపాటు భోగి, మకరసంక్రాంతి, కనుమ పండుగలుగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణాయనం నుంచి ఉత్తరాయణం ప్రారంభమవడంతో వచ్చే మార్పులను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య మూడు రోజుల పండుగను జరుపుకోవాలని కోరారు.

ఆకుల హనుమంతరావుకు నివాళి

లంగర్‌హౌస్: నిస్వార్థంగా పార్టీ కోసం పని చేస్తు తనతో పాటు మరెందరికో దారి చూపిన గొప్ప వ్యక్తి ఆకుల హనుమంతరావు అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. జనసంఘ్, బీజేపీ సీనియర్ నాయకులు ఆకుల హనుమంతరావు మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన దినకర్మ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులతో కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గవంతరావు, ఆశోక్‌యాదవ్, శంకర్‌యాదవ్, గౌతంజీ, ఉదయ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఘనంగా సరస్వతీ శిశుమందిర్ వార్షికోత్సవం

గోల్కొండ: సరస్వతీ శిశుమందిర్‌లో విద్యను అభ్యసించిన విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిగా ఎదుగుతారని సరస్వతీ విద్యాపీఠం కార్యనిర్వాహక కార్యదర్శి, పూర్వ విద్యార్థి హరిస్మరణ్‌రెడ్డి అన్నారు. శనివారం కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ భావాలతో పాటు హిందూ సంస్కృతి ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పతకమూరి శ్రీనివాసరావు, వజ్రలింగం, వెంకటేశ్వర్లు, గంగాధర్, పరమానంద బన్సల్, ప్రధానోపాధ్యాయులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో యువజన దినోత్సవం

గోల్కొండ: విద్యార్థులకు స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకమని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి విభాగం ఇన్‌చార్జి డాక్టర్ పల్లె అపర్ణ అన్నారు. శనివారం కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆరంభ్ పేరిట యువజన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు స్వామి వివేకానంద ఒక నిలువు నిదర్శనమన్నారు. డాక్టర్ మాధవీలత, ఆరంభ్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ నీలి రమేష్, వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అభినందన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ వాలంటీర్ అభిలాష్‌ను వాలంటీర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభినందించారు. నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో పలు పోటీల్లో అభిలాష్ పాల్గొని రెండోస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వాలంటీర్లు, కో‌‌– ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భీమ్ సింగ్‌లు అ భినందించారు. వారు మాట్లాడుతూ.. సమాజ సేవలో ఎన్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ ముందుంటుందని వివరించారు. వివిధ రకాలలో పోటీలలో పాల్గొని జిల్లా స్థాయి లో అభిలాష్ ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌గా తన సత్తాచాటారని గుర్తు చేశారు. వాలంటీర్లు అందరూ భవిష్యత్తులో జరిగే అన్ని పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. హెచ్‌సీయూలోని విద్యార్థులు, ఉద్యోగులంతా ఎన్‌ఎస్‌ఎస్ చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాలంటీర్లు రసజ్ఞ, వెంకట్‌దాస్, మహ్మద్ జునైద్, అభి లాష్, యోగేందర్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చైనా మాంజాను వినియోగించొద్దు


గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు

గచ్చిబౌలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గాలిపటాలను ఎగురవేయడానికి చైనీస్ మాంజాను ఉపయోగించొద్దని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు శనివారం ప్రజలను కోరారు. ప్రభుత్వం చైనీస్ మాంజా (థ్రెడ్)ను ఉపయోగించొద్దని దీన్ని నిషేధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది నాన్ బయోడిగ్రేడబుల్ అని, దీనితో పర్యావరణం, ప్రకృతిని కలుషితం చేస్తుందన్నారు. ఈ మాంజా సాంప్రదాయంలో ఉపయోగించే పత్తి కంటే సింథటిక్ పదార్థంతో తయారు చేస్తారని ఆయన పేర్కొన్నారు. దీని వినియోగం ద్వారా మనుషులకేకాకుండా పక్షులు, జంతువులకు కూడా తగిలితే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఊహించని సంఘటనలు కూడా చోటు చేసుకుంటాయన్నారు. దీన్ని చేతులతో కత్తరించడం కూడా ఎంతో కష్టమని, దీని ద్వారా చేతులకు కూడా గాయాలయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. అందుకే ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజాను గాలిపటాలను ఎగురవేయడంలో ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆయన స్పష్టం చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబంతో సంతోషంగా నిర్వహించుకోవాలని సాంప్రదాయ బద్ధమైన వాటిని వినియోగించే పర్యావరణ, ప్రకృతి పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు.

'ఫుట్‌పాత్ వ్యాపారులను వేధించొద్దు'

గోల్కొండ: ఫుట్‌పాత్ వ్యాపారులను వేధించొద్దని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టూంబ్స్ రోడ్-షేక్‌పేట్ నాలా రోడ్డుకు వచ్చే అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో సైతం తోపుడు బండ్ల వ్యాపారులను, ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకునే వారిని ట్రాఫిక్ పోలీసులు చలాన్‌లు వేస్తున్నారని, దీన్ని వల్ల చిరువ్యాపారులపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ప్రజల ఫిర్యాదుల మేరకే తాము ఫుట్‌పాత్‌లపై, రోడ్లపై వ్యాపారాలు చేసే వారికి హెచ్చరిస్తున్నామని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు ఎమ్మెల్యేకు వివరించారు. యూటర్న్‌లు, రోడ్లపై అక్రమ వాహనాల పార్కింగ్ విషయాలపై తమకు ప్రతినిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఏదేమైనా ఫుట్‌పాత్ వ్యాపారులకు చలాన్‌లు వేయడం మానుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ స్పష్టం చేశారు. చిరు వ్యాపారులైన పేద వారిపై చలాన్‌లు వేయడం సబబుకాదని ఆయన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు.

ముగ్గుల పోటీలు.. బహుమతుల ప్రదానం


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న పద్మావతి తదితరులు


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ముందు సంక్రాంతి పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ మహిళా మోర్చా అధ్యక్షురాలు గడిల పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ అమరేందర్, అత్తాపూర్ కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీ శంకర్ విచ్చేసి బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి తలారి సరిత, రెండో బహుమతి ఎం. పుష్ప, మూడో బహుమతి పూజిత, నాలుగోవ బహుమతి సరస్వతి, ఐదవ బహుమతి వరలక్ష్మీలు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం. కొమురయ్య, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు వీణా సేవక్, సరితా రెడ్డి, స్వప్న రెడ్డి, ఇ. వేణుగోపాల్, వై. హరగోపాల్, సిద్ధేశ్వర, నరేశ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలల్లో

రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం సూర్య భగవాన్ దేవాలయంలో బోయ రమేశ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి పార్వతీ, రెండో బహుమతి ఆర్. లక్ష్మీ, మూడో బహుమతి డి. జ్యోతిలు గెలుపొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పాశం మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అత్తాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షులు ఎం. మల్లికార్జున్ గౌడ్‌లు పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. భాస్కర్ గౌడ్, బంగి శ్రీనివాస్, బాల పోచయ్య, స్టార్ చిన్న, గుర్రంపల్లీ యాదగిరి, మధుబాబు, రవీందర్ గౌడ్, జెట్టం సుభాష్, సదాశివ, సంజయ్, వంశీ, సృజన్, శ్రీకాంత్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.